# దేవుడింకా ఉన్నాడు!

ఇటీవల నేను మా స్వగ్రామం వెళ్లాను. నాకు అయిన వాళ్ళంతా అక్కడే ఉన్నారు. వాళ్ళని చూసి పదేళ్ళయినది. నేను జంఝాలు తెంపేసి తద్దినాలు మానేసి, ఏనాడయితే వితంతువును అందులో మరో శాఖదాన్ని పెళ్ళాడానో ఆనాడే నాకు మా బంధువులకు ఋణం తీరిపోయింది. నేను మా ఊరు వదిలిపెట్టి వెళ్ళిపోతున్నా నన్నప్పుడు అందరూ సంతోషించారు. నా ప్రయాణానికి ముహూర్తాలు పెట్టారు. "ఎప్పుడు వెళ్ళటం?" అని ఒకటికి పదిసార్లు అడిగారు, "ఇంకా పోలేదా?" అని కూడా అడిగారు. అయిపోయింది. నేను ఊరు విడిచి వచ్చేశాను. వాళ్ళకోరిక ఫలించిందని నేనూ సంతోషించాను.

కాని వారికి సంతృప్తి కలిగినట్టు లేదు. నేను వాళ్ళ మొహం చూడకుండా పదేళ్ళు గడపగలగటం వారు సహించలేక పోయినారు. నాకు బంధువులమీద ప్రేమే లేదన్నారు. ఎవరు బ్రతికున్నారో ఎవరు చచ్చారో కూడా నేను పట్టించుకోవటం లేదన్నారు. నాకు నిష్ఠురపు ఉత్తరాలు రాశారు. చివరకు నేను మోసపోయినాను. వాళ్ళంతా కాలంతోపాటు మారారనుకున్నాను. నిజంగా సంతసిస్తున్నారని నమ్మాను. వెళ్ళాను.

అరుగుమీద చాపేసి కూర్చోబెట్టారు నన్ను. ఊళ్ళో ఉన్న బంధువులంతా చేరారు. మామూలు కుశల ప్రశ్నలు వేశారు. సమాధానం చెప్పాను. సంభాషణ ఆగిపోయింది.

అందరి మొహాలకేసి చూశాను. ఎవరి మొహానా ఒక సంతోషంగాని, విచారంగాని లేదు.

ఆకస్మాత్తుగా నిశ్శబ్దం భంగమయింది.

"చావు వెధవా!" అని మా పెద్ద వొదినగారు తన ఆఖరు కొడుకును ఫెడీమని వీపుమీద ఒక్కటి చరిచింది. వాడు బాకా పట్టాడు. వాడి మెళ్ళో రెండు తాయిత్తులూ, మొలకు మరొక తాయిత్తు కనిపించింది. పిల్లవాడు

చాలా అనారోగ్యంగా ఉన్నాడు. పొట్ట పెరిగింది. రొమ్ము ఎండుకు పోయింది. కాళ్లు పుడకల్లే ఉన్నాయి. తల పెద్దదిగా కనిపిస్తున్నది.

"పిల్లవాడట్లా ఉన్నాడేం వదినా ?" అన్నాను.

"నేను చేసుకున్న రాత !" అన్నదావిడ.

"ఏమన్నా మందిప్పిస్తున్నారా ?"

మా చినతాతయ్య దగ్గాడో, లేక నవ్వాడో, ఆ రెండు చప్పుళ్లు ఆయన ఒకటిగానే చేస్తాడు.

"భైరవ శాస్త్రుల్లూ...నవగ్రహ జపం చేసి...తాయెత్తు కట్టాళ్ళే" అన్నాడాయన సావధానంగా.

విషయం మార్చటానికని "ఇక్కడ ఈ ఇటికల పోగేమిటి ?" అన్నాను.

"మాడనేగుట్రా ? మేడమీద దక్షిణ వేపు గది విప్పించేశాం ?" అన్నాడు మా పెదనాన్న.

"ఏం ?" అన్నాను ఆశ్చర్యంగా. మా దిక్కుమాలిన మేడకల్లా అదొక్కటే సుఖమైన గది.

"అందులో తాతయ్య ఉన్నాడు కాదుమరి?" అన్నాడు పెదనాన్న.

తాతయ్య ఉండటమంటే మీ కర్థంకాదు. మా తాత చచ్చిపోయి దయ్యమై ఆ గదిలో ఉంటున్నాడు. మరే గదిలోకి తాతయ్య రాడు.

"భైరవశాస్త్రుల్లు చేత ముగ్గులూ అవీ వేయించాం. లాభించలేదు. తాతయ్యకు భేతాళ మంత్రం వచ్చును కాదుమరీ ? భైరవశాస్త్రుల్లు ముగ్గులు పని చెయ్యలేదు. యాగణ హోమం చేస్తానన్నాడు భైరవ శాస్త్రుల్లు. బ్రహ్మహత్య దేనికని మే మంతా వారించాం" అన్నాడు పెదనాన్న.

చినతాత దగ్గాడో లేక నవ్వాడో.

ఎందుకూ ? గది పడగొట్టేస్తే...ఆయనే వెళ్లిపోతాడు...ఆ గదిలో అన్నయ్య ఏమన్నా నిక్షేపం దాచాడా—లేకపోతే ఆ గదిని విడిచి ఎందుకు పోడూ? అని నాకు సందేహం కలిగింది. సగం అందుకే నేను పట్టుబట్టి గది పడగొట్టించేశా" అన్నాడాయన.

"అన్నీ అవస్థలుగానే ఉన్నవి కొంపకు. (గొంతు తగ్గించి) సత్యం వ్యాపారం మళ్ళీ లేచిపోయింది. సుబ్రహ్మణ్యండి వాడితో—"

సత్యమంటే మా రెండో అన్న. నేను మా వూరు వదిలినాక వాడి భార్య పోయింది. రెండో పెళ్ళి చేసుకున్నాడు. ఈవిడ అదివర కొకసారి లేచి పోయిందని నాకు తెలీదు.

"ఇదంతా సత్యం మొదటి భార్యపనే! బాలింత చావు కూడా చచ్చిందా? నానా ఏడుపులూ ఏడుపిస్తున్నది! సత్యానికి నెలకోసారైనా కనిపించి, నీ కాపరం సాగనిస్తాననుకున్నావా, అని బెదిరిస్తూంటుంది. అది లేచిపోయిందంటే పోదూ? దీనికి నలుగురు పిల్లలు పుట్టారా? మూడోవాడు తప్ప మిగిలిన వాళ్ళంతా పోయినారు. అందర్నీ పొట్టన బెట్టుకుంది" అన్నాడు పెదనాన్న.

"మూడోవాణ్ణి వదిలిందేం?" అన్నాను.

"ఏం వదిలింది? వాడికి అన్నీ ఘోరాలే! డాక్టర్ను వద్దు అంటున్న కొద్దీ మీ పెద్ద అన్న పిలిచాడు. వాళ్ళ మోహం! డాక్టర్లేం చెబుతారు? తల్లికి సవాయి రోగం ఉందన్నాడు. నిక్షేపమైన బ్రాహ్మణ కుటుంబంలో సవాయి ఏమిటి వాడి శ్రాద్ధం? భైరవ శాస్త్రుల్ను పిలిస్తే అసలు కీలకం ఇట్టే చెప్పాడు. ఇదంతా సత్యం మొదటి పెళ్ళాం పనే!" అన్నాడు పెదనాన్న.

చిన్న తాతయ్య దగ్గాడు.

"అసలు సత్యానికి గురువులో శనీ! రవి కోణంలో ఉన్నాడు. సప్తమంలో శుక్రుడూ బుధుడూ ఉన్నారు...ఇంకా రెండేళ్ళ మూడు నెల్ల పన్నెండు రోజులు. అప్పటికి సత్యానికి మారకమన్నా కావాలీ లేదా మంచి యోగమన్నా పట్టాలి. ఏదో ఒకటి తప్పదు" అన్నాడు చిన తాతయ్య.

నే నీ మాటలు వింటూండగా మా పెద్దన్న రెండో కూతురు ఎప్పుడో వచ్చి నా జేబులో పెన్ను లాగి మోకాలికి పెట్టి రెండుగా విరిచి కాళ్ళమీద సిరా పడ్డందుకు పెద్ద పెట్టున ఏడవసాగింది. మా పెద్దనాన్న చప్పున లేచి నా కండువాతో దాని కాళ్ళు రెండూ తుడిచాడు.

మా చినతాత మా సత్యానికి రానున్న మారకయోగం సంగతే ఇంకా ఆలోచిస్తున్నట్టు కనబడ్డాడు. ఆయన నిట్టూర్చి "ఏమో, అన్నింటికీ భగవంతు డున్నాడు" అన్నాడు.